
# బాల వికాసం



## కరోనా వైరస్

వచ్చింది వచ్చింది.
కరోనా వైరస్ వచ్చింది.
చైనా లోన పుట్టింది.
అన్నీ ఊర్లకు పాకింది.
జంతువుల నుండి వచ్చింది.
తెలియకుండానే వచ్చింది.
జలుబు, దగ్గుతో వస్తుంది.
మనుషులను బలి చేస్తుంది.
కరోనా నుంచి బయటపడండి.
దూర ప్రయాణాలు చేయకండి.
చేయి చేయి కలపకండి.
దండాలే మేలండి.
చేతులు శుభ్రం చేయండి.
గోర్లలో మట్టి ఉంచకండి.
పచ్చి మాంసం తినకండి.
జాగ్రత్తలు పాటించక పోతే
ప్రాణాలే పోయేనండి.



-శ్రీనాద్,
2వ తరగతి

నెల్లూరు జిల్లాలోని కొండాపురం మండలంలో గల గొట్టి గుండాల బి.సి. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కవితలు ... సాహిత్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు వెలుగోటి నరేష్ (సెల్: 7382392390)కు అభినందనలు_సంపాదకుడు

## వర్షం



వాన వాన మల్లెల వాన
చిరుజల్లులై కురిసే వాన
హరివిల్లులై పోరిలే వాన
చల్లని గాలులై వీచే వాన
చిటపట చినుకుల జల్లుల వాన
నేలను తాకే జడివాన
కారుమబ్బులై ఉరిమే వాన
వాగులు వంకలు పొంగే వాన
పాడిపంటల పసిడి వాన
వానా వానా చిటపట చినుకుల వానా..



-ఇ.శారోని,
5వ తరగతి

## పలక



పలక పలక చిన్నారి పలక
బలపంతో రాసే పలక.
చిన్నారికి అండగా ఉండే పలక.
ఎన్నో బొమ్మలు గీసే పలక.
ఎందరో పిల్లలు వాడే పలక.
చెక్కతో తయారైన చక్కని పలక.
పలక లేనిదే చదువే రాదు.
పలక లేని పిల్లలే లేరు.
పలకతో రాని అక్షరమే లేదు.

-పి. ప్రకాష్
2వ తరగతి




## సంక్రాంతి

సంక్రాంతి పండుగ వచ్చిందిరో
సంతోషాలను ఎన్నో తెచ్చిందిరో
సంక్రాంతి ముగ్గులు వేశారురో
పల్లెలకి సందడి వచ్చిందిరో
రైతుల బాధలు తీర్చిందిరో
సంతోషాలను నింపింది మన కళ్ళలో.
రకరకాల ముగ్గులు వేశామురో
పల్లెలన్నీ సంబరాలు జరిపారురో
పొద్దున్నే లేచి భోగి మంటలేశారురో
అందరూ సంతోషంతో పండగను జరిపారురో
కొత్తబట్టలు పండుగకి వేసుకున్నమురో
అన్నదమ్ములను ఒకటిగా కలిపిందిరో
పిల్లలేమో గాలిపటాలతో సంతోషించారురో
వచ్చింది వచ్చింది సంక్రాంతి పండుగ
సంతోషాలను ఇచ్చింది సంక్రాంతి పండుగ.



- టి.నరేష్
2వ తరగతి



## కరోనా వైరస్

కరోనా వైరస్ వచ్చిందమ్మా
అందరికి ప్రమాదాన్నే తెచ్చింది.
ఒకరి నుంచి ఒకరికి వస్తుంది.
అన్నీ ఊర్లు తిరిగేస్తుంది.
చేతులు శుభ్రంగా ఉండాలి.
మనం జాగ్రత్తలు పాటించాలి.
మోచేయి వరకు సబ్బుతో కడగాలి.
పరిశుభ్రతలు పాటించాలి.
ప్రమాదాన్ని తగ్గించాలి.



- సి.హెచ్..కార్తిక,
3వ తరగతి

## మిరప



తోటలోన మిరప కాసింది.
అందరూ తోటకు వెళ్ళారు.
మిరపకాయలు కోశారు.
పచ్చి మిరప, ఎర్ర మిరప తెచ్చారు.
పచ్చి మిరప పచ్చడి దంచారు.
కూరల్లో మిరప వేశారు.
ఉప్పు మిరప కాయలు వేయించారు.
బజ్జీలు చాలా చేశారు.
ఎర్ర మిరపతో మిరపచారు చేశారు.
అన్నీ బాగా మెక్కారు,
హాయిగా నిద్రపోయారు.
కడుపునొప్పి వచ్చింది.
డాక్టరు దగ్గరకి వెళ్ళారు.
సూదులు బాగా పొడిచారు.
అమ్మో అని ఏడ్చారు.



-టి.నరేష్,
2వ తరగతి.

## కరోనా వైరస్

కరోనా వైరస్ వచ్చింది.
దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు
కర్చీఫ్ అడ్డుగా పెట్టండి.
షేక్ హ్యాండ్ ఇవ్వకండి.
నమస్కారమే పెట్టండి.
అందరు శుభ్రంగా ఉండాలి.
అందరి ప్రాణాలు కాపాడాలి.
-ప్రకాష్, 2వ తరగతి

## గురువు దీవెన

నీలగిరి కొండల సమీపములో ఓ అందమైన సిరిపురము అనే చిన్న పల్లెటూరు ఉండేది. చూడచక్కని ప్రకృతి సౌంధర్యమును కలిగి వెన్నెల ఆరబోసినంత ఆహ్లాదకరంగా ఉండేది. కమ్మని మమతలు విరబూసిన ఓ కుటీరము కూడా ఉండేది అక్కడ ముత్యపు మహర్షి అనే ఓ సాధుపుంగవుడు పిల్లలకు అన్ని రకాల విలువిద్యలను నేర్పిస్తూ విద్యాబుద్ధులను నేర్పుతూ జీవితాలను బాగుపరుస్తూ అందరికీ మార్గదర్శిలా ఉండేవాడు. ఒక్క రోజు గురువు గారికి పండ్లు తేవడానికి శిష్యులు నీలగిరి కొండపైకి వెళ్లారు. అందరూ శిష్యులు గురువుగారికి పండ్లను సేకరించి తెచ్చి ఇచ్చారు. కానీ ఒక్క శిష్యుడు మాత్రము మూలికలను సేకరించి ఓ సంచిలో వేసుకోని కుటీరములోకి వచ్చాడు. అందరూ శిష్యులు పండ్లను తీసుకొని వచ్చి గురువుకు సమర్పించారు. కానీ మూలికలు తీసుకొచ్చిన అక్షితుడు మాత్రము మూలికల బ్యాగును ఓ మూల దాచి ఉంచాడు .

ఒక రోజు హోరుగా గాలి వాన ఒచ్చింది. తళుక్కని మెరుపులు మెరిసాయి. మేఘాలు గట్టిగా ఘోషిస్తూ కుంభ వర్షమును కురిపించాయి. పూజ నిమిత్తము గుడికి వెళ్లిన ముత్యపు మహర్షి వానలో ముద్ద ముద్దగా తడిసి పోయాడు. తడిసిన బట్టలతో ఆశ్రమానికి చేరుకున్న గురువుకు విపరీతమైన జలుబు జ్వరము వచ్చి గజగజ వణుకుతూ మంచము పట్టాడు ముత్యపు మహర్షి శిష్యులు అందరూ పండ్లు తెచ్చి గురువుగారిని తినమని కోరారు కానీ అక్షితుడు మాత్రము గురువు గారి పరిస్థితిని చూసి చివ్వుక్కున లేచి గబుక్కున పరిగెత్తుతూ పోయి మూలికల సంచిని తెరిచి గుప్పెడు మూలికలను తీసుకొని బండ మీద ఉంచి రాయితోటి గబగబ మెత్తగా చేసి పసరును తీసి గురువు గారికి మూలిక పసరును శరీరము అంతా పట్టించాడు అక్షితుడు గాఢ నిద్రలో ఉన్న ముత్యపు మహర్షి కళ్ళు తెరిచి చూడగానే ఒంటిమీద మూలికల పసరును పూయగా తగ్గిన జ్వరము చూసి లోలోపల ఎంతో ముచ్చట పడ్డాడు. ముత్యపు మహర్షి శిష్యులు అందరినీ పిలిచి గురువు గారు ఇలా సెలవిచ్చాడు. మీరు అందరూ విహార యాత్రకు వెళ్లి మీకు తోచింది వచ్చేపుడు తీసుకురండి అని గురువు ఆదేశించాడు. గురువు అదేశము మేరకు అందరూ నీలగిరి కొండకు వెళ్లారు శిష్యులు అందరూ ఎవ్వరూ పాటికి వారు అంధమైన ప్రకృతి ఒడిలో ఆడుతూ పాడుతూ కేరింతలు కొట్టారు పండ్లను పూలను సేకరించి బ్యాగులు నింపుకొని వచ్చారు. కానీ అక్షితుడు మాత్రము ఓ రెండు కొమ్మలను చేతులో పట్టుకొని ఇంటికి వచ్చి చేరాడు. అది చూసి మిగతా శిష్యులు అందరూ పకపకమని నవ్వుకుంటూ చెవులు కొరుక్కున్నారు కానీ అక్షితుడు మాత్రము తీసుకొచ్చిన మూలిక కొమ్మలను ఓ చోట గోతిని తీసి కొమ్మలను పూడ్చి పెట్టాడు. కొన్ని రోజులకు మూలిక చిగురించి రెమ్మలు వేసింది అంతలో మూలిక చెట్టు సువాసన వెదజల్లుతూ ఊరంత గుప్పుమంది. ఇది చూసి గురువు ఎంతో సంతోషించాడు. ఓ రోజు ముత్యపు మహర్షి శిష్యులు అందరినీ పిలిపించి విద్య భోదిస్తు నాయన్నలారా నా వయసు ఐపోయింది చూపు తగ్గింది మీ విధ్యాభ్యాసము కూడా ఐపోయింది.

గనుక మీ స్వగ్రామాలకు బయలుదేరమని చెప్పాడు ముత్యపు మహర్షి. అందరూ బయలుచేరారు. అందరూ వీడ్కోలు తీసుకోని వెళుతుండగా అక్షితుడు మాత్రము ఓ మూల కూర్చొని దిగులుగా వుండేను. గురువు ఏమిటి నాయనా మీ ఊరికి బయలుదేరు అని గురువు అన్నంతలో మేము అందరూ వెళ్లిపోతున్నాము మీరు ఒక్కరే ఎలా ఉంటారు. నేను మీ వద్దనే ఉండి తోడు నీడగా ఉంటానని మొరపెట్టుకున్నాడు. అంతలో గురువు నీ గురుభక్తికి మెచ్చితిని నాయన్న నీకేమి వరము కావాలో కోరుకో అన్నాడు. ఎప్పటికీ మీ శిష్యుడుగా పుట్టే వరము ఇవ్వమని అడిగాడు అక్షితుడు.

శిష్యుని గురుభక్తికి మెచ్చి నాయనా నీవు చరిత్రలో నిలిచిపోయే విలువిధ్యను నీకు వరముగా ఇస్తున్నాను అని ముత్యపు మహర్షి వరము ప్రసాదించాడు. అంతలో ఓ రోజు విహారయాత్రకు వచ్చిన సింధు రాజ్యపు కుమార్తె సింధుజ బందిపోటు దొంగలు వలలో చిక్కుకున్న రాణిని రక్షించాడు.

ఇది మెచ్చుకున్న సింధు రాజ్యపు రాజు రాకుమారిని ఇచ్చి పెళ్లి చేశాడు. కొన్ని రోజులకు అక్షితుడు మహారాజుగా సింహాసనాన్ని అధిష్టించాడు. గురువు ముత్యపు మహర్షి విలువైన వరముతోనే రాజును అయ్యానని ప్రజలు అందరికీ తెలియజేసి ముత్యపు మహర్షి విగ్రహాన్ని రాజ్యములో ఏర్పాటు చేసి గురుభక్తిని చాటుకున్నాడు అక్షితుడు. ఇలా గురువు వరముతో అక్షితుడు చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయముగా మిగిలిపోయాడు.




- ధనాశి ఉషారాణి
చిత్తూరు
9121096397

## మా అమ్మ




అమ్మా... అమ్మా...
మా ముద్దుల అమ్మ.. అమ
అమ్మా... అమ్మా... మా ముద్దుల అమ్మ... అమ్మ...
అమ్మా... అమ్మా... మా మంచి అమ్మ...
అమ్మ ఒడిలో హాయిగా నిద్రించే ఓ పసిపాపనై
అమ్మే మనకు అమృతమూ, అమ్మే మనకు ఆనందమూ
అమ్మే మనకు దైవమూ, అమ్మే మనకు జీవమూ
అమ్మే మనకు నడక నేర్పెను, అమ్మే మనకు నడవడికను నేర్పెను
అమ్మే మనకు జీవమూ, అమ్మే మనకు స్వర్గమూ
అమ్మే మనకు జీవితమూ,అమ్మే మనకు జీవనాధారమూ
అమ్మే మనకు గోరుముద్దలు పెట్టెను,
అమ్మే మనకు దాహం తీర్చెను
అమ్మే మనకు మాటలు నేర్పెను, అమ్మే మనకు చదువూ నేర్పెను
అమ్మను మించిన దైవమే లేదు, అమ్మే నా ప్రాణం.



-ఇ.షారోని,
5వ తరగతి.

## పడవలు చేద్దాం

రాండోయ్ రారండి.... పడవలు చేద్దాం రారండి.....
భలే భలేగా పడవలు చేద్దాం ....
రంగురంగుల పడవలు చేద్దాం .....
పడవలు చేసి నీటిలో వదిలేద్దాం.....
పడవల పందెం వేసుకుందాం....
పడవల పందెంలో పోటీ పడదాం....
పడవలతో ఆడుకుందాం.....
పడవల పందెంలో అందరమూ గెలిచేద్దాం .....
రాండోయ్ రారండి పడవలు చేద్దాం రారండి....



- డి.రూపశ్రీ
5 వ తరగతి

## అక్షరోదయం

తొలిపొద్దు
పొడవక మునుపే
'రాత్రి చీకటిని' కప్పుకొని ఉన్న..
ఆశయాల కోరికలకు
మర్ధన చేస్తూ!
కోడికూత రాగాలపానతో
ప్రభాత సూర్యుడిని
మేథస్సులో నింపుకొని
వడివడిగా శరాలకు
కాలకృత్యాలు గావించి
మనసులోని
భావాలకు ఊపిరిపోశా!!
ఉదయ కిరణాలను
కనులకు తొడుక్కొని
అడుగులను వేసుకుంటూ
నిత్యశోధనలో అనంతమైన
బృహత్తర కార్యాన్ని



నెమరువేసుకుంటున్నా!
సుప్రభాత రాగం
మదిలో తాళం పల్లవి
చరణ విపంచీలా..
నూతన ఒరవడిలో
ఉత్తేజపు ఆలాపన గావిస్తున్నా!
కాంతిరేఖల చినుకుల్లో
నక్షత్రాల మిణుకుల్లో
ప్రతి ఉదయం
మహోన్నత శిఖరమై
విజయదంకా ఎగురవేయాలని
సుస్వాగతం పలికే
ఆమని కోమల స్వప్నలా..
మేలికొలుపు మధనమై
ప్రకృతి పులకరించదా!
మది పరవశించదా!
ఉదయమే మనుగడకు
జీవనజ్యోతి మూలంకదా!
'అక్షరోదయ'మై పులకరించదా!

-పగిడిపల్లి సురేందరు
9290701508

## చినుకులు

కన్నీళ్లను దోసిల్లలో పట్టి
మేఘాలను వేడుకున్ననో..!
తక్షణమే స్పందించి
ఈ..క్షణమే చినుకులను
మా వాకిట్లోకి ప్రవహిస్తున్నయ్!
ఎన్ని దుఃఖాల ముసురో..!
నేలను ముద్దాడిన చినుకులు
చినుకు తాకిన నేలలపై
చిట పట మని చిందులుగా..
చినుకు చినుకు పరవళ్ళుగా..
మదిలో తనువంత ఒణుకుతూ
ఆనందము నిండేను బతుకు



-పగిడిపల్లి సురేందరు పూసల

## ప్రపంచ కవితా దినోత్సవం.. !

విశ్వకవిత దినం నేడు
పుష్కల కవనాలతోడు
జాతికి దారిని చూపెడి
కవులకావ్యరచనచూడు!

సాహిత్యపు రంగమందు
సాహితీ ప్రక్రియలవిందు
పాఠక దేవుళ్ళు చదువను
జ్ఞానపటిమభలెపసందు!

కావ్యముసుజ్ఞానసింధువు
మేధకు చైతన్య బిందువు
నవరసాలహర్ష మొసగు
నవవినోద కల్పతరువు!

కవితలెంతొసంచలనము
కలిగించును చైతన్యము
విశ్వకవుల పద్య గద్య..
నవ్యచరితకు నిదర్శనము!

అకలంకముసాహిత్యము
అజరామర ప్రజాహితము
అందరి యశస్సు కోరెడి..
సమాజ సుమార్గ సహితము!

వివిధకవుల మణిహారము
నవకవనపు సుమహారము
పరిమళ భరిత మై వెల్గె..
విశ్వకవిత ప్రకాశితము...!!
(ప్రపంచకవితా దినోత్సవం సందర్భంగా..)



-డా॥గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## మెరుపులు

చేసిన తప్పులు
రాసిన రాతలు
చెరగని జ్ఞాపకాలు
మనుషుల జీవితాలు
తీపి గుర్తులు
మధుర క్షణాలు
తిరిగిరాని రోజులు
మనుషుల జీవితాలు

ప్రేమ ఆప్యాయతలు
తల్లిదండ్రుల రూపాలు

చదువు సంస్కారాలు
ఒజ్జల చదువులు

చేసిన తప్పులు
తప్పవు తిప్పలు
చేసిన అప్పులు
జీవితంలో తిప్పలు

-చమ్మాశ్రీ
9441333315

## చిలక పలుకులు

క్రికెట్ కి జట్టు
క్షవరానికి జుట్టు
సంసారంలో గుట్టు
లేకపోతే వ్యర్థమోయ్ వ్యర్థం

రైలుకు పట్టాలు
పండుగకు చుట్టాలు
నీటికి గొట్టాలు
లేకపోతే వ్యర్థమోయ్ వ్యర్థం

కవికి కలం
రైతుకు పొలం
మొక్కకు జలం
లేకపోతే వ్యర్థమోయ్ వ్యర్థం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## అమరులకు జోహార్...!!

రెండొందల ఏళ్ళ చీకట్ల చీల్చి
వేకువ పొద్దులై పొడిచారు

తరాల బానిస సంకెళ్లు తెంచ
బతుకు దారాదత్తం చేసారు

ఉద్యమాల ఊపిరిలూది
విప్లవాల బాట పట్టారు

పరాయి పాలన మీద
తిరుగుబాటు జెండా ఎగరేశారు

"ఇంక్విలబ్ జిందాబాద్" అంటూ
ఇల తలం నినదించారు

కుటిల బ్రిటీషర్లకు
చావు దెబ్బ రుచి చూపారు

సామ్రాజ్య వాదుల
పునాదుల బీటలు వారించారు

స్వాతంత్రమే ఊపిరిగా తలచారు
పోరాటమే ఆరాటంగా మలిచారు

జైలు గోడల ఉద్యమ క్షేత్రం చేసారు
సంకెళ్ళకు సమర పాఠం బోధించారు

ఉరి తాడును నవ్వుతూ ముద్దాడారు
మీసం మెలేసి మరణానికి ఎదురెల్లారు

భరత సింహాల్లారా...!
భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజగురు
మీ పోరాట స్ఫూర్తి తరగని నిధి
మీ త్యాగ నిరతి తరాల పెన్నిధి

మీ వీరత్వం విశ్వజ్వలనం
మీ అమరత్వం అచంద్రతార్కాణం

అమర వీరుల్లారా!
జాతి జాతిగా గుండెల్లో ప్రతిష్ఠిస్తాం
గళం గళంగా విప్లవ జోహార్ అర్పిస్తాం

*(మార్చ్ 23 న భగత్ సింగ్ సుఖ్ దేవ్, రాజగురుల వర్ధంతి సందర్భంగా...)*




- కోడిగూటి తిరుపతి
9573929493

## భయం! భయం!

భయం! భయం! భయం
అది చేస్తే భయం!
ఇది చేస్తే భయం.

మాట్లాడితే భయం
పోటీ పరీక్షలంటే భయం
పొరపాటునో, గ్రహపాటునో,
ఒకసారి ఓటమివస్తే
పని చేయ్యకుండా, పరీక్షలు రాయకుండా
పండుకుంటే ఎట్లా?
ఓటమికి భయపడేవారు
ఎన్నడు విజయం పొందలేరు
వెలిగే దీపం గాలివస్తే ఆరిపోతానని
వెలుగకుండా ఉంటుందా!
భ్రమణంలో యుండే రవిచంద్రులు తమకు
మేఘాలు అడ్డువస్తాయని గమనం ఆపుతాయా!
మనుసంతా లక్ష్యసాధనలో వుంచితే
మన ఇంటికి విజయలక్ష్మి చేరుతుంది
మన పేరు ప్రతిష్టలు
లోకానికి తెలియజేస్తుంది.



- సిరిగాద శంకర్
సెల్: 9493001985

## మర్మం

అల్లుకు పోవడం
తెలియకపోవచ్చు.
పందిరికి
గుంజలా నిలబడిన చాలు.
లౌక్యం
లేని వాణ్ణి కదా!
ప్రవాహంలా
చొచ్చుకుపోవడం
నేర్వక పోవచ్చు
ఒక్క దాహం తీరినా చాలు.
వ్యాపనం
ఎరుగని వాణ్ణి కదా!
పువ్వై
పరిమళించడం
రాకపోవచ్చు
దండలో దారమైనా చాలు.
రెక్క చాచడం
చేతకాని వాణ్ణి.
కవితా క్షరాల్లో
పదచిత్రం
కాకున్నా పర్వాలేదు.
నీ భావాలకు
వొత్తు నైనా చాలు.
ఊరేగడం
గిట్టని వాణ్ణి.
తెలియక అడుగుతున్న
'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం' కదా!




-పోరెడ్డి రంగయ్య

## కవిని

నేను కవిని
కరముతో కలం పట్టి
కాగితాన్ని సేద్యం చేస్తూ
అక్షరాలను
విత్తనాలుగా నాటి
పదాలను
పంటగా మార్చి
కవిత్వమనే పుస్తకాన్ని
పాఠకులకు అందిస్తాను.
-చాపల మహేందర్
9949864153

## ద్దాందాం

కాస్తంత ఖాళీలోనైనా
కుక్కలా ముడుచుకుందాం



గదుల లోపల
మరిన్ని గదులను తెరుచుకునైనా
గుండె గదులను జోకొడదాం

మైదానాల కలయికల్ని కత్తిరించి
ఇంట్లోనే ఏకాంతాలుగా వెదజల్లుదాం



కొమ్మల మధ్య శూన్యాన్ని
రెక్కల శబ్దంతో నింపేద్దాం
బయటకు వెళ్లాలనే
తలపుల్ని కూడా
తలుపుల వెనుక
భద్రంగా మూటకట్టి పెడదాం

స్వయం నిర్బంధాల నీలి నీడల్లోనైనా
రేపటి వెలుగును స్వప్నించుకుంటూ
కనిపించని శత్రువుపై యుద్ధం ప్రకటిద్దాం

అనేక సార్లు బతకటం కోసమైనా
కొన్ని సార్లయినా బలాదూరును బంధించి
శత్రు ద్వారాల్ని మూసేద్దాం



రేపటి ఆలింగనాల కోసమైనా
నేటి కరచాలనాలను నిలిపేద్దాం

యుద్ధం ముగిసాక
గుంపులు గుంపులుగా కూడేందుకైనా
ప్రస్తుతం తుంపులు తుంపులుగా విడిపోదాం


లాంగ్ లివ్ ల కోసమైనా
లాక్ డౌన్లను ప్రేమిద్దాం!



- చిత్తలూరి
8247432521

## ఆ మెట్లు!

పూర్వీకుల భుజస్కందాలే
నేటి మన విజయ పంథాలు.
పరాజయం
నిపుణతకు మేల్కొల్పు.
విజయం
సోమరితనానికి పురికొల్పు.
ప్రయత్న విరమణం
మరణంతో సమానం.
ఓటమి..
కొత్త పుంతలకు పునాది
అనుభవం నేర్పే గట్టి పాఠం.
దాటిన మెట్టు
గెలుపు దారిలో ప్రథమం
మరణమే.. ఆఖరి మెట్టు.
పరాజయాలకు పర్యాయైతే
చీకటిని జయించే వాడా థామస్ ఎడిసన్?
ఓటమిని అంగీకరిస్తే
టెలిఫోనును కనిపెట్టే వాడా
గ్రాహం బెల్?
పట్టిందల్లా బంగారమైతే..
సామర్థ్యానికి రుజువుండేదా?
రాలిన పండు కన్నా
కొమ్మన వేళ్లాడే పండు ఇంకా తీపి.
జీవితం.. తీగ మొక్కలాంటిది
ప్రతి ముడి మలుపులో
పువ్వునో, కాయనో ఇవ్వదు.
ఓటమికి వెరువని కార్యశూరులకు
ఆ పాఠాలే..
విజయానికి సోపానాలు.
ఆటంకాలనే...
ఆ మెట్లుగా మలుచుకుంటే...
వేసిన ఏ అడుగు కానేరదు
వెనుకడుగు!



-ఆచార్య కడారు వీరారెడ్డి
(9392447007)

## అమ్మా నాన్నలు... !

అమ్మ లేకపోతే నాన్న
కాలెదెపుడుమహిన మిన్న
నాన్న ఉండకపోతేను..
అమ్మ ఔతుందా కన్న ..!

అవనిలో ఆదిదంపతులు
పుడమి లోన పుణ్యమతులు
ఈ విశ్వ జనావళికిని
సజీవపు మూలభూతులు..!

అమ్మ ఇలను త్యాగ శీలి
నాన్న చతురసుపరిపాలి
చేతుల్తో సదా సేవిస్తూ..
పూజిస్తేనే సరి జాలి..!

అమ్మంటేనే జగతికి శక్తి
నాన్నంటే అమ్మకు భక్తి
పసిపాపలజన్మలకును
వీరిరువురి ప్రేమయుక్తి.. !

కన్నవార్కి కైదండలు
సేవలతో పూదండలు
సృష్టి మూల కారకులకు
ఇద్దామిక అండదండలు...!!!!

-శ్రీమతి చింతోజు పద్మావతీ
8464954860

## నాన్న-మొగ్గలు

తప్పటడుగులు తప్పుటడుగులుగా పడకుండా
భవతవ్యానికి పూలబాటవేసే బాటసారి
మన బాల్యపు తొలి స్నేహితుడు నాన్న

మనం కష్టపడకూడదని తను రాత్రింపగళ్ళు కష్టపడి
మన ఆనందం కోసం తన సుఖాన్ని త్యజించు త్యాగశీలి
మన జీవితంలో వెలుగునింపే క్రొవ్వొత్తి నాన్న

మన కోరికలు గుర్రాలైనపుడు వాటిపై స్వారి చేస్తూ
కష్టం కలగకుండా మన ఇష్టాలనుతీర్చే అక్షయపాత్ర
మన ప్రేమకు నిలువెత్తు ప్రతిరూపం నాన్న

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 2-4-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3


### నమ్మలేని నిజాలు

కొత్త పోకడ
నీతిమాలినపని
నగ్న నృత్యాలు

హరిత రక్ష
వాన నీటికి భిక్ష
దేశం శుభిక్షం

ఈగ దోమలు
అనారోగ్య మృదంగం
కర్ణ కఠోరం

జన దుస్థితి
పట్టణ పురోగతి
మారని స్థితి.

ప్రాణ వాయువు
నీటిలో గాలిలోను
బతుకు జీవి



- రేడియమ్
9291527757

### శ్రీనిజాలు

గుంపులలో తిరుక్కుంటు
కోత లెన్నొ కొస్తావ్!
కరోనా వైరస్ తోని
దోస్తు చేస్తె చస్తావ్!

ఎంత చిన్న పామైనా
పెద్ద కట్టె తోటి కొట్టు!
కనబడని సూక్ష్మ రాక్షసి
దూరముండి మట్టు పెట్టు!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



## వలస పక్షులు

ఒకప్పుడా చెట్టునిండా
పిట్టలుండేవి
కొమ్మ కొమ్మకూ
కువ కువలుండేవి
ఎంత ఎత్తులకు ఎగిరినా
ఆ ఊరి గాలినే
గుండెల నిండా నింపుకునేవి.

ఓ రోజు...
రెక్కలకు కొత్త ఆశలు తొడిగి
చెట్టుకొకటి, గుట్టకొకటి
బహు దూరాలకు
తరలి వెళ్ళాయి.
కొత్త ఊపిరిని నింపుకుందామని
వుంటున్న ఊరికి
దూరంగా ఎగిరాయి
పొంచివున్న మహమ్మారి
ఒక్కసారిగా విరుచుకుబడింది.
చెట్లకు క్యారంటైన్ సోకినట్టుంది
చిగుళ్ళు ఆకుల చాటున
బందీ అయ్యాయి
కొమ్మ కాయాల్సిన కొమ్మలు
కొమ్మలు విసురుతున్నాయి.


ముడుచుకున్న ముక్కులు
ఆకలిని కత్తి రించడం లేదు.

యిప్పుడా పిట్టలకు
ఓ చెట్టంటూ లేదు
పో పొమ్మని తరుముతుంటే
నీడ కోసం
ఓ చల్లని ఒడి కోసం
రెక్క లల్లాడిస్తూ
విలవిల లాడుతున్నాయి.
ఎంత దూరం ఎగిరినా
ఏ వూరికావూరు
దూరంగా జరుగుతున్నాయి.
యిప్పుడా వలస పక్షులకు
కాసింత ఆసరా కావాలి
బతకడానికింత
శ్వాస కావాలి
గుండెలకు హత్తుకునే
చెట్టంత మనిషి కావాలి.
యిహ..
కొత్త రాగాలు
అవే పుట్టుకొస్తాయి
తడారిన గొంతుకలు
మళ్ళీ చిగురిస్తాయి
ఏదో రోజు
తమ గూటికి అవే చేరతాయి
వలసలకు
కొద్ది రోజులు
సెలవు ప్రకటిస్తాయి!

(కరోనా నేపథ్యంలో ఎక్కడికక్కడ
చిక్కుకుపోయిన
వలస కార్మికుల దురవస్థలకు
స్పందిస్తూ...)







## మానవాళిని కాపాడుకుందాం.. మహమ్మారిని తరిమేద్దాం

సమిష్టి చైతన్యం- కరోనా అంతం మనందరి పంతం
స్వీయ నిర్బంధం-అదే మనందరి కర్తవ్యం
పరిశుభ్రతను పాటించు..ప్రతి విషయం ఆలోచించు
సమావేశాలు, సభలు రద్దు.. తటస్థంగా ఉండుట ముద్దు
కరచాలనాలు వద్దే వద్దు..గుంపులుగా తిరుగొద్దు
అందరికీ విపత్కరకాలం.. కలిసికట్టుగ ఎదుర్కొందాం
ఓ శాస్త్రజ్ఞులారా..మానవాళిని కాపాడుకుందాం
కరోనా భూతాన్ని తరిమికొడదాం.. పాతరేద్దాం..



- జి. అంజలీదేవి
9703186814

## కలికాలం.. కరోనా కాలం

జగమంతా కరోనా..విశ్వమంతా హైరానా
భయం గుప్పిట్లో జనం.. భద్రంగా ఉండాలి మనం
కరచాలనాలు వద్దే వద్దు.. నమస్కారమే ముద్దు
స్వీయ నియంత్రణే రక్ష.. అదే మనకు శ్రీరామరక్ష
కలికాలం.. కరోనా కాలం.. విశ్వమంతా విపత్కరకాలం
మానవాళిని కాపాడుకుందాం.. మహమ్మారిని తరిమికొడదాం
పరిశుభ్రతను పాటిద్దాం.. కరోనాను నియంత్రిద్దాం
కరోనాతో కంగారువద్దు.. కలిసి గుంపులుగా తిరుగొద్దు
రోజంతా ఇంట్లో ఉందాం.. నమస్కారమే సరైన నిర్ణయం
కలిసికట్టుగా కరోనాను కనుమరుగులేకుండా చేద్దాం.



- ఎం.ఎస్. విజయకుమార్
సెల్: 9441089035

## కరోనా దురాగతాలు మానుకో.. !

ఒక్కడుగుతో
నడక ఆరంభమని
హత్తుకోవడం
ఆలింగనమని
చేతులు కలుపుట
చెలిమియని
సమూహమే
సమాజ శక్తియని
ఇపుడనుకోవడం
కానిపని....
శత్రువు
తుమ్మినప్పుడుకలడు
ఉమ్మినపుడు కలడు...
ప్రజాప్రాణనాశకుండు..
జాగ్రత్తలో
పరమ జాగరూకులై
ఇంట్లో హాయిగ గడపండి
వంటికిదే మంచిదండి!

నా చేతులే
నాకు శత్రువులుగ జేసి
కనులు, ముక్కు, నోరు
మూపించిన కరోనా..
కరాళ నృత్యం
అనునిత్యమాయే!
వికృతి చేసే
విలయతాండవానికి
ప్రకృతి పెడుతుంది
కీలెంచి వాత...
సమయం మించి
పోకముందే కరోనా...
కదు జాగ్రత్తగా...
తొలిగిపో!
చేస్తున్నది చాలిక
మానుకో... మారిపో..!!!



-డాక్టర్ గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493

# భావాంచితమైన "అక్షర విహంగాలు"






తెలుగు సాహిత్యంలో మినీ కవితల తర్వాత నానీలతో ప్రారంభమై ఇప్పటివరకు అనేక కవితా ప్రక్రియలు వెలుగులోకి వచ్చాయి. రాయగలిగే సత్తా ఉంటే చాలు ఏదయినా రాయగలమంటూ ప్రతి ప్రక్రియను ఆహ్వానిస్తూ దాదాపుగా అన్నింటికీ కవులు న్యాయం చేస్తూనే ఉన్నారు. తమయొక్క ప్రతిభను నిరూపించుకుంటూనే ఉన్నారు. సుగమ్ బాబు సృష్టి "రెక్కలు" ఇప్పటికే అనేకమంది మంచి కవులే రచించడం విశేషం. ఈ ప్రక్రియలో నాలుగు పాదాలు సాధారణంగా ఉన్నా చివరి రెండు పదాలలో సత్తువ ఉండాలనేది ఈ రెక్కల ఆంతర్యం. అంటే చివరి రెండు వాక్యాలు రెక్క అన్నమాట. పక్షి కూర్చునీ కూర్చుని ఒక్కసారిగా ఎగిరినట్లు ఈ ప్రక్రియ తీరు కొనసాగుతుంది. తెలుగు కవిత్వంలో రఘువీర్‌ప్రతాప్ గారిది ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. అనేక కవితా సంపుటిలను వెలువరించారు. ముఖ్యంగా 'అమ్మ' అనే కవితా సంపుటి ప్రముఖ అనువాదకురాలు స్వాతి శ్రీపాద గారి ద్వారా ఆంగ్లంలోకి అనువాదం అవడం విశేషం. ఈ సంపుటిలో దాదాపుగా ప్రతీదీ ఆకట్టుకునేలా ఉంటుంది. ప్రతి రెక్కను పొందు పరచడంలో ఎంతో శ్రద్ధను కనబరిచారు. ఉదాహరణకు కొన్ని రెక్కలు గమనించండి...

**"అరువు/ బంగారం/ ఒంటికి/ భారం/ సాటిలేనిదే/ సంతృప్తి"**

ఇక్కడ పై పదాలన్నీ కలిపితే ఒకే వాక్యం అవుతుంది. అరువు బంగారం ఒంటికి భారం అనేది ఇదివరలో మనం విన్న "పరువు సొమ్ము పాము వంటిది" అన్నట్లు అర్థంతో రచించారు. కానీ రెక్క విషయంలో సాటిలేనిది సంతృప్తి అనడంలో సంతృప్తి ఉంటే చాలు సాటిలేనివారు అవుతారనేది ఈ రెక్క ఆంతర్యం. అలాగే అన్నీ కొనసాగుతాయి.

**"అభిమానానికి/ అదుపేది/ అడిగినంత/ ఇస్తూ పోతే సరా" రెక్క ( మితమే /హితం)**

**"జోస్యం / చెప్పవచ్చు/ హాస్యం /పండించవచ్చు/ రెక్క ( లోకోభిన్న/ రుచి)**

**"సరైన సమయానికి/ అనువైన మొక్క/ నీరున్నప్పుడే / పండించాలి పంట/**

**దీనికి రెక్క ( పున్నమిరోజే/ చంద్రుని అందం)**

**"రోగాన్ని/ గుర్తించగల్గితేనే / నిజమైన / డాక్టర్" రెక్క ( చదువు /సార్థకం)**

ఇలా సాగుతాయి వీరు రచించిన రెక్కలు. విషయం ఏదయినా సూటిగా కాకుండా మెల్లగా చెబుతూ ఒక్కసారిగా చురక అంటించే రీతిలో సాగుతాయి. ఈ కవి ప్రతి రెక్క లోనూ తమదైన శైలిని ఉపయోగించారు. వీటిలోనే నీతినే కాకుండా వ్యంగ్యం, హాస్యం కూడా ఉంటాయి. చెప్పగలిగిన వారికి చెప్పినంత అనే తీరులో సాగుతాయి

ఒకానొక రాజకీయ నాయకునిపై ఇలా వ్యంగ్యాస్త్రం వేస్తారు **"దారిలేని ఊరికి/ ఎలా వెల్తావు/దారి చేసుకొనా/ దారి తెల్సుకొనా/ అంటూ రెక్కగా "సృజనే/ హర్షదాయకం"** అంటారు. అంటే దారి నీయంతట నీవు తెలుసుకుని వెళ్ళు, లేదా దారిని చూపి వెళ్ళు అనే అర్థంలో సాగిన ఈ రెక్క ఎంతో ఉత్తమమైన రీతిలో సాగింది. కవితలు రచించే ప్రతి కవికీ తెలుగు భాషమీద పట్టుతో పాటు ప్రేమ కూడా ఉండి తీరుతుంది. అదే కోవలో సాగిన ఈ రెక్కను గమనించండి **"మాలయితే/ మాస్టారి/ మెడలోనే/ వేస్తాన్నేను/ రెక్క ( తరగని ధనం/ తెలుగు తియ్యంధనం) అంటారు. మరోచోట "నోరుంది కదాని/ వాగకు/ వయస్సుంది కదాని/ రేగకు "** రెక్క ( తెగేదాకా/ లాగకు) అంటారు. నిజమే కదా నోరుందని వాగటం, వయసుంది కదాని అరవడం అనే తీరు సర్వ సాధారణంగా సాగుతున్న ఈ సమాజానికి చెప్పిన జవాబు "తెగేదాకా లాగకండి అని చెప్పడమే అనడం బావుంది. ఇలాగే అనేక రెక్కలు సమాజానికి హితం చెప్పే విధంగా ఉన్నాయి. సుగమ్‌బాబు గారి ఆంతర్యంలో కూడా రెక్క ద్వారా సమాజానికి హితం, తత్త్వం బోధించే విధంగా ఉండాలనే విషయాన్ని కవి రఘువీరప్రతాప్ చక్కగా అందిబుచ్చుకున్నారు. వీరికి అభినందనలు..


ప్రతులకు: ఎన్.వి.రఘువీర్‌ప్రతాప్
9-6-369, ఫ్లాట్ నెం.103
రోడ్ నెం.14, మారుతీనగర్
చంపాపేట్, హైదరాబాద్-59.
సెల్: 9440551552



-శైలజామిత్ర
9290900879

## వైరస్ తో "వార్"

మెడలో స్టెతస్కోప్‌తో
ప్రజల ప్రాణాలకు రక్షణగా
వైద్యుడు.
కరోనా వైరస్ కట్టడికోసం
జనజీవన సంరక్షకులుగా
పోలీసులు.
పరిసరాల పరిరక్షకులుగా
పారిశుద్ధ్య కార్మికులు.
కంటి మీద కునుకు లేకుండా
కాచుకుని ఉన్నారు!!
విపత్తులు చెప్పిరావు
శత్రుసైన్యాలు దొంగదెబ్బ
తీస్తాయనుకున్నప్పుడు
ఎదుర్కోవడం వీరుల లక్షణం
శత్రురాజ్యమేదో
శత్రువు ఎవరో గుర్తించలేనప్పుడు
యుద్ధం అనివార్యమై
ఉత్కంఠత సహజం-
మేధోభివృద్ధితో క్షణం తీరికలేని
పరుగుల జీవితాలను
వైరస్ "వార్" కు రమ్మంది
దాని మూడో పాదం
ప్రపంచమంతా
వ్యాపించినప్పుడు
ప్రజల ప్రాణాలకు
బాధ్యులెవరూకాదు-
డబ్బును ఎరగావేసి అంతస్తులను
ఆశగా చూపడానికి
శత్రువు సామాన్యుడుకాదు!!
క్షణాలను డాలర్లు గా మార్చుకునే
హంగులజీవితాలకు
"వైరస్ "మరణశాసనం రాస్తుంది!!
సైనిక బలగాలు చాలనప్పుడు
శత్రువును బంధించడం
సాధ్యం కానప్పుడు
స్వీయ నిర్బంధంతో యుద్ధం చేయాలి
వేదభూమిని స్మశాన భూమిగా
మారకుండా చూసుకోవడం
సమిష్టి కర్తవ్యం!!
ఆదర్శాలు వల్లించడం కాదు
ఆచరించాలి
చేతిలో చేయి కలిపి
ఒకరికి ఒకరం అనేది
నాటి మాట-
ఎవరికి వారే రక్షకులు అనేది
నేటి మాట-
ముఖానికి మాస్క్
చేతులకు సానిటైజర్
మనిషికి మనిషికి మధ్య
మీటర్ దూరం
చిరునవ్వుతో నమస్కారం
నేటి రక్షణ మంత్రం!!



-వాసరచెట్ల జయంతి
చరవాణి-8555849733

## మానవత్వంపై కరోనా యుద్ధం

మానవత్వంను మంట గలుపుతూనే
మరణ ఛాయలను ముద్దాడుతూ అలా
కన్నీరు పెట్టిస్తున్న ఓ కరోనా మహమ్మారి
కత్తులు చూస్తూ కొంపను ముంచుతున్న రక్కసి
జనులు అందరూ గృహ బంధీలై ఉంటే
నిత్య అవసరాలకు కూడా బయట రాలేక పోతుంటే
సంబర పడుతూ సవాలు విసురుతున్నావు
పసిడి పిల్లలు ఆట పాటలు లేక ఆందోళన చెందుతుంటే
వలసకూలీలు గుప్పెడు బువ్వకోసము బిక్కుబిక్కుమంటూ తల్లడిల్లుతుంటేను
మరణ మృధంగము వాకిట్లో
భీతిల్లుతూ
మనిషి నిండు వేదనలో మునిగిపోతూవుంటే
మా ఆవేదన సాక్షిగా నిన్ను నాశనము చేస్తాము కరోనా
కలియుగపు మహమ్మారీ పారిపో మమ్మలిని వీడి

-ధనాశి ఉషారాణి
భాకరాపేట. చిత్తూరు జిల్లా

## కరోనా-కర్తవ్యం-దైవం

కరోనా కబళిస్తోందని
కంగారా!
కరోనా రావడానికి
రంగమెంత సిద్ధం చేసావో!
కరుణలేని కరోనా అంటూ
ఆడిపోసికుంటున్నావు!
అది నీలో లేశమైనా ఉందా?

ఎంతసేపూ స్వార్థచింతలే!
పరమార్థచింతన
చింతకాయంతయినా ఉందా?
అధర్మవృద్ధికి ఫలితం
అవతారమేగా!
'కల్కి' మారి, 'కరోనా'
రూపమెత్తింది!

ఎంతసేపూ,
ఆత్మస్తుతి, పరనింద,
ఇవే నేటి మానవజాతి పంథా
ఎప్పుడైనా, ఎక్కడైనా,
ఎవరితోనైనా నీవో దాదా!
అందుకే 'కరోనా',
'కాలం విసిరిన పంజా!'

నీళ్ళు, కన్నీళ్ళు వ్యాపారమే!
ఏ సందర్భమైనా,
అంతులేని ధనార్జనే
ధ్యేయం అవడం నేటి
దౌర్భాగ్యం,
అంబులెన్స్ ప్రయాణం
ఓ గొప్ప సాక్ష్యం!

వాడ్ని దారుణంగా
దోచుకుంటున్నావు,
నీవు గొప్పగా
దాచుకుంటున్నావు,
ఇద్దరి మీదా వేలాడుతోంది
కనిపించని కరోనాకత్తి,
అది నీ మీదే పడి, వాడు
తప్పిపోవచ్చేమో?

మానభంగాలు,హత్యలు
సామాజిక నిత్య అకృత్యాలైన వేళ,
నిర్భయ హంతకుల ఉరి
తాత్సారం
కరోనా విశృంఖల విహార
ప్రోత్సాహమేమో!

-సుబ్బారావు.

## ఓ..శివయ్య

ఇటు చూడయ్య
ఓ..శివయ్య
ఏ రాక్షసుడు
వరం పొందాడయ్య
ఖండాలనే
వణికిస్తున్నాడయ్య
జనాంగం
అతలా కుతలమయ్య
కరోన
మహమ్మారయ్య
విడువాల్సింది
పశుపతాస్త్రం కాదయ్య
తెరవాలి శివయ్య
మూడవ నేత్రం
భస్మం కావాలి
ఆ కరోన నయనం
ఊపిరి పీల్చుకోవాలి జనం
విముక్తి పొందాలి విశ్వం

-కనుమ ఎల్లారెడ్డి
పౌరశాస్త్ర అధ్యాపకులు
తాడిపత్రి

పుస్తక సమీక్ష

# సామాజికాంశాలతో 'నూగూరి' నుదుటి సింధూరం

కొత్తగా ఎంతో మంది కవిత్వాన్ని రాస్తున్నారు. కాదు, కాదు ఆస్వాదిస్తున్నారు. సామాజికాంశాలపై పట్టును సాధిస్తూ అక్షరంతో యుద్ధం చేస్తున్నారు.

పాఠకులను ఆలోచింపజేస్తున్నారు. అందులో ఒకరు 'నాగా నూగూరి'.

నాలోకి నేను అంటూ చెప్పుకున్న కవయిత్రి అక్షర సేద్యం ఎలా మొదలైంది అని ఇలా చెప్పుకొచ్చారు

**అక్షరమై నన్నల్లుకున్నదో...**
**నేనే అక్షరాన్ని అల్లేసుకున్నానో...**
**తేల్చుకోలేని అంతగా పెనవేసుకుపోయింది**
**నా అక్షరం...**

**నుదుటి సింధూర మై...** ఆహా ఎంత చక్కటి భావనో అలతి అలతి పదాలతో హృద్యంగా మలిచారు

**ఊహించనే లేదు**
**అక్షర విత్తు నాటి**
**భావాల మొలకలతో**
**కవనాల పూలు పూయిస్తానని** అంటూ కవయిత్రి ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తు తన తొలి కవితా సంపుటంతో పాఠకలోకానికి తనను తాను పరిచయం చేసుకునే ప్రయత్నం చేశారు.


**హృదయ గులాబీ నా నుదుటి సిందూరం అయిన వేళ**

**నా చుట్టూ శాటిలైట్ పరిభ్రమిస్తూ...**
**నాలోని రహస్యాలను ఎక్స్రే తీస్తూ...**
**నన్ను మొత్తంగా దోచేశారు!!**

అంటూ శ్రీవారి నీ మెచ్చుకుంటూ వారి వివాహ బంధం యొక్క గాఢమైన అనుబంధాలను నెమరు వేసుకుంటూ నా సింధూరం కోసం అంటూ కవితకు ముగింపు పలకడం అద్భుతంగా ఉంది.

చాలా సున్నిత మనస్కురాలైన కవయిత్రి నాది కాలేని పుట్టినిల్లు అనే కవితలో

**నా ఇంటికి నేనే**
**చుట్టపు చూపుగా**
**వెళ్లడం గుర్తొచ్చే**
**జ్ఞాపకాలతో మనసు ఎప్పుడు**






**తడుస్తూనే ఉంటుంది ఎందుకో..!!** అంటూ ఎంతో ఆర్ద్రతతో రాశారు . అత్త వారింటికి వెళ్లి పుట్టింటికి పండుగకు పబ్బానికో వచ్చేస్త్రీ యొక్క హృదయం లోపలి మనసును చిత్రించిన తీరు ప్రతి మగువ తనలో తాను చూసుకుంటూ హృదయం ద్ర విస్తుంది.. ఈ కవితకు మహిళా లోకం ఫిదా అవుతుంది. అంతగా ఆకట్టుకుంది ఈ కవిత మరో అంశం నెలసరి ఎన్నెన్నో కట్టుబాట్లు లక్ష్మణ రేఖలు బాధగా అనిపించినా ఆ మూలాల వెనుక ఉన్న భావాలను ప్రస్తావించి చాలా చక్కటి కోణాన్ని ఆవిష్కరించారు.. ఆ సమయంలో స్త్రీకి విరామం అవసరం ఉంటుందన్న నేపథ్యమే కావచ్చు. మల్టీ టాస్క్ మహిళ కవితలో

**మంచుదుప్పటి వీడనేలేదు**
**రెప్పల దుప్పటి**
**విప్పివిప్పగానే ఎన్ని పనులో....**
**అన్ని తానై చేసుకుంటూ పోయిన ఆమె శ్రమకు విలువేది??** అంటూ ప్రశ్నించినా పంక్తులు ఆకట్టుకున్నాయి

'అమృతం ఇచ్చే మట్టిమనిషి' ఈ కవితలో పేద రైతే మన పాలిట దేవుడు అని

**పేదోడి గొంతు కష్టాల గరళాన్ని మింగి**
**సుఖాల అమృతాన్ని పంచుతుందని**
**వంటలు వండించే రైతుని రాజులా చూసుకుంటామని** ఆశిస్తూ రాసిన కవిత రైతు నెత్తిన అక్షరం కిరీటాన్ని అలంకరించారు

'మిద్దెతోటలు' కవితలోతలో

**కరడు కట్టే కాంక్రీటు అతివకై అశ్రులు చాచక**
**మిద్దె పై మా రాణి కురు లారాబోసినట్లు**
**సొర బీర కాకర లతల జాలువారే సొగసులు**
**మా రాణి నడు ఒంపుసొంపులు**
**సోయగాలైచుట్టేయగా**
**ఆరోగ్య సిరులు పూయింతచే మీద్దె** తోటల పెంపకాన్ని స్వాగతిస్తూ రమణీయంగా దృశ్యమానం చేశారు.. సుతిమెత్తగా నర్మగర్భంగా చెప్పారు. కాంక్రీట్ కు కాస్త విరామం ఇచ్చి పచ్చదనాన్ని అల్లు కోవాలని సూచించారు. ఏ కాస్త ఆలోచన ఉన్న పాఠకుడైన కచ్చితంగా మొగ్గుచూపుతారు మిద్దె తోట పెంపకానికి చాలా చక్కని శుభ పరిణామం ఇది.

యువ శక్తి జాతీయ శక్తి నిరూపించుకోవాలని సదుద్దేశంతో చక్కని ఎత్తుగడతో వారి ఆలోచనలకు అక్షరాకృతి ఇచ్చి

**యువకులారా**
**వన రాజైన సింహం లాగా గర్జించే**
**పాలకుడైన పాలించే ప్రభువే నీవై**
**అవినీతి అంతమొందించే**
**పెను తుఫాన్ బలమే నీ వై**
**ఆదర్శవంతుడు వే అవ్వాలి** అంటూ యువతకు హితబోధ చేశారు ప్రతి పాఠకుని మనసులో ఆలోచన రేకెత్తించే విధంగా కవితకు మంచి ముగింపు నిచ్చారు

కాదేదీ కవిత కనర్హం అంటే ఇదేనేమో నవరసాల జల్లు కురిపించారు ఇలా

**కోపగించేవేళ బుసకొట్టే జడై**
**కాటేసేను**
**అలిగిన వేళ**
**తపనలు రేపే**
**రసపట్టు జడై**
**పని పట్టేను**
**మురిపించే వేళ**
**ముగ్ధ మనోహరంగా**
**కనికట్టు జెడై**
**కవ్వించే ను**

అంటూ నవరసాలు ఒలికించారు.

కవయిత్రి మొదటి పుస్తకమే అయినా మంచి పరిణతితో చక్కటి పదబంధాలతో సామాజిక స్పృహతో చక్కటి కవితలను అందించారు.

**ప్రతులకు**
నాగ నూగూరి
8-1బి588/1
జయశంకర్ కాలనీ
కట్ట రాంపూర్. కరీంనగర్ 505001
9849027939



-అరుణ కీర్తి పతాక.కరాదుల
9395147443

## నిజమైన దేవుడు "డాక్టరే" !!

మనుషులకు దేవుడిపై నమ్మకం వుండాలి
అంతేకాని గుడ్డినమ్మకం కాదు.
కంటికే కనిపిస్తలేదు " కరోనా ' ఐన
ప్రపంచాన్ని కల్లోలం చేసి
శవాలుగా మారుస్తుంది.
మహామహా సంపన్న దేశాలే కరోనా కత్తికి
భలైపోతుంటే ఇంకా గుడ్డినమ్మకాలే....!
కరోనాకు ఆడమగ తేడాలేదు
వున్నోళ్ళు లేనోళ్ళు అని తేడాలేదు
చిన్నాపెద్దా, ఈమతం ఆమతం, నలుపు తెలుపు
అనే తేడాలు అసలు లేవు
క్షణాలలో ఎటునుంచి ఎటైన వచ్చి చంపేస్తుంది
మనల్ని మనం రక్షించుకోవాలంటే
ఇల్లుదాటి బయటకు రాకుండా వుండడమే
అనునిత్యం శుభ్రతను పాటించడమే.
ఇప్పుడు ప్రపంచానికి ఒక్కదేవుడే వున్నాడు
ఆయనే ప్రాణంపోసే " డాక్టరు"
ఆ వైద్యుని నిరంతర పోరాట ఫలితమే
మన ప్రాణాలకు రక్షణ.
అతడు కనిపెట్టే మందు కరోనాకు విరుగుడు మందు,
ఏకులమైన ఏ మతమైన
పూజించాల్సింది డాక్టరును
ప్రాణాపాయం అని తెలిసిన
వారి ప్రాణాల్నిపణంగా పెట్టి
కరోనాతో పోరాడుతున్నారు.
చివరికి సైన్సు గెలిచింది
ఇకనైన తారతమ్యాలు ,భేదాలు వదలి
అందరం మనుషులుగా బ్రతుకుదాం
సైన్సు మన నమ్మకం
ప్రపంచానికి సైన్సు ప్రాణరక్షణ ప్రాణభిక్షణ !!



-తాంద్ర చిరంజీవి
9959180762.

## బ్రేక్ 'కరోనా' చైన్

ప్రచండ సునామీ చుట్టేసిన ప్రపంచం
విశ్వాన్ని వణికిస్తోన్న విధ్వంసక వైరస్
వికటాట్టహాస స్వైరవిహారానికి విరుగుగా
లోకపు తలుపులకు తాళాలేసిన వేళ
స్వచ్ఛంద లక్ష్మణరేఖలే జీవన గీతలు
ఆయుష్షును ప్రసాదించే సౌమిత్రి గడపలు !

గీత దాటిన సీతేగా రావణుడికి మరణం తెచ్చె
గడప దాటితే నీవు, చావును కొనితెచ్చుకున్నట్లే
సామాజిక దూరాలే కరోనాకు అడ్డుకట్టలు
గీతనతిక్రమిస్తే కోవిడ్ దారుణ దాడులు
హద్దులు దాటితే ఆఖరి కేకలే శరణ్యాలు
స్వీయ నియంత్రణే తెచ్చు ఆనంద కేరింతలు !

కోవిడ్‌తో కన్ను మూస్తే, మోసే వాడే కరువు
అనాథ ప్రేతంలా అంతిమయాత్రల తంతులు
సంగ్రామానికి సకల అణ్వాస్త్రాలవసరం లేదు
అంటురోగం కన్నా అధైర్యం అతిప్రమాదకరమే
రక్కసితో పోరాటంలో వీరావేశాలసలే వద్దు
శౌచంతో గృహనిర్బంధ సహనమేగా ముద్దు !

వైరస్‌ను తరిమే అవిశ్రాంత సేవాహస్తాలు
మానవతామూర్తుల విధ్యుక్త విధినిర్వహణలు
ప్రాణాల్ని పణంగా పెడుతున్న వైద్య దళాలు
పోలీస్ బాయ్‌ల స్ఫూర్తిదాయక భాధ్యతలు
చావు నోట్లో తలపెట్టిన పారిశుధ్య జీవులు
దైవానికి వారే ప్రతిబింబ ప్రతిరూపాలు !

విపత్కర స్థితిలో అక్రమార్జన చక్రవర్తులు
ధరలకు రెక్కలు తొడిగే అధర్మ ప్రబుద్ధులు
శవాలపై పేలాలేరుకునే పరమ సన్నాసులు
మానవత్వాన్నే అటకెక్కించిన నీచాతి నీచులు
తల్లి రొమ్మునే తన్నే జాతికి పట్టిన చెదల్లు
కరోనా కన్నా అతిక్రూర భయంకర జీవులు !

ఆపదలో అండగా నిలిచే ఆపన్నహస్తాలు
కరోనా కట్టడికి విరాళాల వితరణ వెల్లువలు
చేతికి ఎముకలే లేని ఔదార్యమూర్తులు
మానవీయ విత్తులు నాటే మహానుభావులు
మనసున్న భరతమాత ముద్దు బిడ్డలు
రేపటి విలువలకు దారి చూపే దీపస్తంభాలు !

కరచాలనం నాగరికత అన్నారానాడు
కోవిడ్ పుణ్యాన అనాగరికుడైనాడీనాడు
నమస్కారమే లోక సంస్కారంగా నిలిచిన వేళ
ప్రపంచం శవాల దిబ్బగా మారక పూర్వమే
దూరంతో కోవిడ్‌కు చరమగీతం పాడి
బ్రేక్ కరోనా చైన్‌కో.. అకల్మంద్ బస్కే.. !



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## కరోనా బాంబు

మండే ఎండలో
మసై పోతావనుకున్నా..!
కాని
నువ్వు
మనుషుల్నే
మసిసేత్తావనుకోలేదు!
సమస్త భూగోళమంతా
సుట్టేసావు
చిత్రం! మహా విచిత్రం!
నువ్వెంత?
నీ రూపమెంత? అనుకున్నా

కానీ,
ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది
రూపం ఎంత చిన్నదైతే
కోపం అంత గొప్పదని
విధ్వంసం సృష్టించే
ఆటంబాంబు కూడా
నీ అంతదేగా!

– డా॥ దాశరథుల నర్సయ్య
సెల్: 9390919100

## కరోనాపై కైతికాలు

కన్పించని వైరస్ కు
ప్రపంచం భయపడడమ
కానీ అది కరోనా
ఎదురెళ్ళిన చావడమే
వారెవ్వా!వదంతులు కూడా వైరస్సే
కానీ వైరస్ అంటే కరోనానే

ఫ్లూని అరికట్టాము
మశూచినీ జయించాము
కలరాను కాలతన్నాం
ఎబోలాను చూశాము
అమ్మో!మహమ్మారి కరోనా
కదలవద్దంటుంది కంగారుపెట్టేస్తుంది

ఎక్కడికీ వెళ్ళొద్దు
ఇంట్లో ఉండుటే ముద్దు
ఎవ్వరూ రావద్దు
అదేకదా మనహద్దు
అయ్యో!తప్పనిసరైతేనే బయటకురండి
కానీ నాలుగడుగులదూరం ఉండండి

ప్రాణమన్న తీపిలేద
ముఖంపై మాస్కులేల
చేతికి గ్లౌజులేల
వద్దన్నా వచ్చుటేల
వహ్వా!హాయిగ ఇంటినుండక
ప్రాణంమీదకు తెచ్చుకొనుటేల

రెండోదశ వచ్చింది
శుభ్రంగా ఉందాము
కరోనాగురించి పూర్తి
విషయం సేకరిద్దాము
వహ్వా!మనల్ని కాపాడుతున్న
వైద్యులకు నమస్కరిద్దాము

–మోహనరావు.

## మనిషి మారలేదు

రూపం అయితే మనిషిదే
రంగులే
ఊసరవెల్లిని తలపిస్తూ
నియంతలా
తన నీడను తనే నరుక్కొంటాడు.

ఆధునికతో
జ్ఞానాన్ని ఎంతో సాధించాడు
పోటీ తత్వంతో
గొయ్యిల్ని తవ్వుతున్నాడు.

ఆధిపత్యం అంటే
అనాధల్ని చెయ్యడం కాదు
రాజ్యం అంటే
ఏ కొందరో కాదు
కోటాను కోట్ల జీవన చిత్రాలు.

చంద్రుణ్ణి తాకిన చేతుల్తో
చెలిమిని తాకలేవు?
ప్రాణాలు పోయినా
పొరుగును ప్రేమించవు
రాకాసిలా
ఏకాకి జీవితం నీది.

మనిషిని మనిషి చంపేస్తూ
ఆధిపత్య పోరులో
అగ్ర తాంబూలం కోసం
అహర్నిశలూ శ్రమిస్తావు
అణువణువూ శోధిస్తావు
అణుబాంబులు ఆశ్రయిస్థావు
మనిషిని బుగ్గి చేస్తావు.

ఇంతేనా ?
ఇంకేం సాధిస్తావ్?
మనిషిగా నువ్వు ఏం మారుతావు...?
కోటాను కోట్ల కన్నీటి చుక్కల్లో
నువ్వు ఒక రోజు రాలిపోతావు.

–మహబూబ్ బాషా చిల్లెం

## కరోనాపై కైతికాలు

చైనా నుండి వచ్చెనంట
కరోనా అను వ్యాధి
భారత ప్రజలను కూడా
వణికించె నా వ్యాధి
బయటకు రాకుండా మనం
అంతమొందించగలం కరోనా అను రక్కసిని

కరచాలనం వద్దు
నమస్కారం ముద్దు
ఆలింగనాలు వద్దు
ఆప్యాయతలే ముద్దు
పరిశుభ్రతను పాటిద్దాం
కరోనాను పారద్రోలుదాం

క్రమశిక్షణ పాటించి
కరోనాను చంపుదాము
మన ఆచారాలే
మేలని చాటి చెబుదాము
మన సాంప్రదాయాల వలన
కలుగునెన్నో ప్రయోజనాలు

కలరాను ఖతం జేసి
మశూచిని మసిజేసి
ప్లేగు వ్యాధిని పారద్రోలినమ్
కరోనాను కట్టడి చేసి
మన ధైర్యాన్ని చాటుదాం
మన దేశాన్ని కాపాడుదాం

వైద్యులకు పోలీసులకు
కరములెత్తి మొక్కుదాం
పారిశుధ్య కార్మికులకు
జేజేలు పలుకుదాం
కరోనా కట్టడికి వారు చేస్తున్న
సేవలెపుడు చిరస్మరణీయం

కరోనా వలన వచ్చిన
సమయమును చేద్దాం
మనం సద్వినియోగం
కుటుంబంతో గడుపుదాం
కరోనా బారిన పడకూడదంటే
గడప కూడా మనం దాటవద్దు

–గొబ్బూరి. గంగరాజు
9032273064

## పరేషాన్ - కరోనా

కరోనా కరోనా ఓ కరోనా...
యావత్తు ప్రపంచ దేశాలను
గడ గడ లాడిస్తోన్న ఓ కరోనా
పొట్టన పెట్టుకుని ఏమీ చేస్తావే కరోనా..
అర్థం కాని కరోనా..
మనుషులు ప్రాణాలను బలి తీసుకొంటున్నావ్..
విప్లవాత్మక ప్రపంచంలో తల దూర్చి
ప్రాణాలతో చెలగాటం చేస్తున్నావ్..
అన్నీ దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాలు,
పట్టణాలు, గ్రామాలను గడ గడ లాడిస్తున్నావ్ కరోనా..
నీవు ఎక్కడ నుండి వచ్చావ్..?
ఎలా వచ్చావ్..?
నీవు ఎవరివి..?
ఎందుకీ నీ కక్ష్య..?
నీ భయంకరమైన దృశ్యాలును చూడలేదని
చూపిస్తున్నావా కరోనా..
ప్రపంచంను నాశనం చేస్తున్నావ్ కరోనా..
భూకంపం కంటే భయంకరం..
సునామి కంటే ఘోరం..
నీ వల్ల ప్రపంచంలోని దేశాలు, రాష్ట్రాలు,
ప్రాంతాలు అన్నీ అతలా కుతలం అవుతున్నాయి..
గుడులు, పాఠశాలలు, ఆఫీసులు, హాస్పిటల్,
దుకాణాలు అన్నిటిని మూతలు వేయించావ్ కరోనా..
దీనికి ఒక్కటే మార్గం..
మనమందరం తరిమిగొడదాం కరోనాని...
మనకు మనమే రక్షకులం..
కరోనాని ఖతమ్ చేయాలంటే నియమాలు పాటిద్దాం..
దేశ ప్రజలు సురక్షితంగా ఉండాలంటే
మనిషికి మనిషికి దూరం దూరం పాటించాలి..
ఇంటికి పరిమితి అవుదాం..
లాక్డౌన్ 21 రోజు పాట్టిద్దాం..
దేశ పాలకులు చెప్పిన లాక్డౌన్ కు కట్టుబడి ఉందాం..
మన రాష్ట్రం, దేశ గౌరవం కాపాడుకుందాం..
నోటికీ మాస్క్ ధరించుదాం..
చేతులను శానిటర్ తో శుభ్రంగా కడుగుదాం..
బయటకు రాకుండా ఇచ్చిన సమయంను పాటిద్దాం...
దూరం దూరం పాటించి వస్తువులును
కొనుకొన్ని ఇంటికి సుఖంగా గమ్యం చేరే ఆలోచన చేద్దాం..
పరిశుభ్రత యే పరమాత్మునిగా...
కరోనా వ్యూహాన్ని తగ్గించాలంటే
శానిటరీలతో చేతులను కడుగుకొని ఎదుర్కోవాలి...
నీకు లేదు స్థానం కరోనా కరోనా..
పోపో కరోనా కరోనా తోక ముడుచుకొని పారిపో..
నీ అంతం మొదలైయింది వెళ్ళిపో వెళ్ళిపో కరోనా..
మూకుమ్మడి పోరాటం సాగించెనని తెలుసుకో..
జనులందరి మధ్య పోరాడే యుద్ధంలో నీవెంత కరోనా!
ఐసొలేషన్ వార్డ్ లో ఉంచుదాం జనులందరని..
చికిత్సని అందిద్దాం.. ఆరోగ్యం కాపాడుకుందాం..
ప్రపంచాన్ని, సమాజాన్ని, రాష్ట్రమును, దేశమును,
పాలకులు అందరూ డాక్టర్, నర్సు, రక్షకభటులు,
తీసుకొన్న లాక్డౌన్ పాటించి మనం మనం ఆరోగ్యం
కాపాడుకుందాం...
ఇలా చేస్తే పారాహుషార్ కరోనా..



– కె. శైలజా శ్రీనివాస్
8019736254

## ఆపత్కాలంలో భూగోళం

ప్రపంచపటంపై ఓ మహా వినాశనం
మరణమృదంగంమ్రోగిస్తోంది...
వైరస్ ల రోగమో,ప్రకృతి
వైపరీత్య రూపమో;మానవ
భోగలాలస కృత్యమో....
ఏదైతేనేం ?
కరోనాతన వికృతరూప కరాళనృత్యంతో
కాలయముడల్లే మారి కదం తొక్కుతోంది...!
అందుకే...?!
కాలం కంటే ఓ అడుగు
ముందుకేసి....?
ఈ నేలపట్ల
ఋణం తీర్చుకుందాం!
తీవ్ర సంక్షోభంలో చిక్కిన
భూగోళాన్ని విపత్తుల నీలినీడల నుండి
రక్షించుకుందాం...!

ప్లాస్టిక్ భూతాన్ని భూస్థాపితంచేస్తూ
ప్రాణవాయువులు పంచే
తరువులను పెంచుతూ
కాలుష్యపు స్థాయిలను
కంట్రోల్ లో వుంచుదాం...

జాగింగ్ లు మాత్రమేకాదు...?
ఫ్లాగింగ్ లకు సైతం స్వాగతాలు పంచుతూ
జీరోవేస్ట్ ఉత్పత్తులను వినియోగిస్తూ
రియల్ హీరోలుగా వెలుగుదాం...

ప్రశ్నార్థకంగా మారుతున్న
జీవవైవిధ్యాన్ని గుర్తించి
శాకాహారభోజనానికిపట్టంకడదాం...!
మన ఇండ్లల్లో వెలువడే
వంటింటి వ్యర్థాలను
ఆర్గానిక్ ఎరువుగా తయారుచేసే
సుకశుభవాక్కులు లిఖిద్దాం...!



–సోంపాక సీత
8639311050

## కరోనా...!

కరోనా కరోనా
చేస్తుంది హైరానా
ప్రపంచ వీధుల్లో
మహమ్మారి కరోనా
డేంజర్ బెల్ మోగిస్తూ
మనుషుల ను మింగేస్తూ.

ప్రపంచపు విపణిలో
విషాన్ని చిమ్ముకుంటు
కుప్పలుగా రాల్చుతుంది
మనుషులకు సవాలంటు
మేలుకుంటే ప్రమోదం
లేదంటే ప్రమాదం.

గుంపుజనాలున్నచోట
ఈ వ్యాధి వచ్చునండి
ఇంట్లో నే ఉండండి
విందులన్ని మానండి
నిర్లక్ష్యం వీడండి
ప్రాణాలు నిలుపుకోండి.

చిన్నాపెద్ద చూడదు
ధనబలం చాలదు
కరోనా మహమ్మారి
కబలించుట ఆపదు
క్వారైంటన్ లుండాలి
కరోనా ను తరుమాలి.

మానవ శరీరపు
మూడు ద్వారాలు
ముక్కు నోరు కండ్లు
కరోనా చేరు బాటలు
మాస్కులు ధరించండి.
కరోనా ను తరుమండి

బువ్వ తినేముందు
శుభ్రత పాటించాలి
సుబ్బు నీళ్ళతోనీ
చేతులను కడగాలి
కరోనా వైరస్ ను
కడిగి పాతరేయాలి.

ఇల్లు విడిచి గుంపులుగా
రా వలదు రోడ్లపైకి
ప్రభుత్వ ఆదేశాలు
కరోనా కట్టడికి
ప్రజావళి అందరూ
పాటించిన క్షేమం కలుగు.

ఆటపాట కట్టిపెట్టి
జీవంకై పట్టుపట్టి
కరోన పై సమరాన
క్వారైంటన్ పట్టి
కఠిన నియమాలతో
నిలుపుదాం ప్రాణాలు.

కన్న బిడ్డలను వదిలి
కరోనా పై పోరుకు
కదిలినారు ఖాకీలు
మండేటి ఎండలకు
మహమ్మారిని నిలువరించ
లాఠీ లతో నిలిచినారు.

కరోనా కట్టడికి
శ్రమిస్తున్న ప్రభుత్వలు
ప్రాణాలడ్డు పెట్టినారు
పోలీసులు డాక్టర్ లు
కనిపించే దైవాలు
కరుణా రూపాలు.



–మొగిలి శ్రీనివాసు
9491746700

## జనతా సమరము !

ఏల వచ్చితివిటు సాహసించి నీవు ?
ఇచట నీకు చోటీయగ ఇల్లు లేదు
పారిపొమ్మిక క్షణమైన పలుకకుండ
ఓ కరోన! నిన్ ద్రోలగ నుద్యమింతు !

ఇంటిని వీడకుంటిమిల నేకముఖమ్ముగ నిల్చి నిన్నికన్
గెంటెదమింక నీ యునికి కీడగు భారతభూమికెప్పుడున్
కంటకివైన నిన్ను రవిగాంచనిచోటికి పారద్రోలి,మా
యింటిని తీర్చుకొందుము మహీతలకౌశలమందిరమ్ముగన్ !

తనువు కరోన పాల్బడిన ధైర్యము వీడక నిల్వు సోదరా!
మనమున శక్తి నింపుకొని మానవయత్నముజేయు సోదరీ !
సునిశితదీక్షయే పథము జూపు మహమ్మరి పారద్రోలగా
కనుల వెలుంగు కాంక్షలను గైకొని ముందుకు సాగిపొమ్మికన్ !

ఎంతటి కరోనయైన మాకేమి భయము?
నియమపాలనతోడనే నిలువరించి
నిత్యమారోగ్యభాగ్యాన నిలువగలము
ఆత్మశక్తియే మాకింక అభయమొసగు !

అప్రమత్తతతోడనే అవనియందు
దుష్టవైరసు దునుమగ దూకవచ్చు
ఇల్లు వీడక వైరసునెల్ల ద్రోలి
చిరము జీవించెదము మేము ధరణిపైన !

ఎన్ని కరోనలైనను జయింపగవచ్చు మహోద్యమమ్ముతో
నెన్నడునైన మానవునకీభువి సాధ్యము గానిదున్నదే?
పన్నుచు సంయమిత్వమును భద్రతకై క్రమశిక్షణమ్ముతో
నెన్నుచు సాగిపోవలె ననేకవిపత్తుల భూతలమ్ముపై !



–డా॥అయాచితం నటేశ్వరశర్మ.
9440468557.

## జనతా కర్ఫ్యూ

ఇప్పుడు తెలిసిందా
కాళ్ళు,చేతులు మంచిగా కడుక్కోవాలని.
ఇప్పుడు తెలిసిందా
వెనుక, ముందు మంచిగా కడుక్కోవాలని.
ఇప్పుడు తెలిసిందా
ముక్కు కారకూడదు
నోరు వాసన రాకూడదు
చెవులకు గాలి సోకకూడదు.
ఇప్పుడు తెలిసిందా
ఎక్కడ పడితే అక్కడ ఉమ్మివేయద్దని
ఇప్పుడు తెలిసిందా
ఎక్కడ వడితే అక్కడ
మలమూత్ర విసర్జన చేయద్దని.
ఇప్పుడు తెలిసిందా
ఎక్కడ వడితే అక్కడ
చెత్త వేయవద్దని.
ఇక జనతా కర్ఫ్యు చేద్దాం
కరోనాను తరిమికొడదాం
జయహో జనతా కర్ఫ్యు
జయహో జనతా కర్ఫ్యు.



–మియాపురం శ్రీనివాస్
పూడూర్
9493264620

## కర్కశ కరోన

అందరినీ పలుకరిస్తూనే
తన గుప్పిట్లోకితెచ్చుకుంటుంది
కరుణకు నిధి కాదు కరోన

బలవంతులను బలహీనులని చేస్తునే
బంధాలను దూరం చేస్తుంది
బకాసురుణ్ణి మించిన కరోన

ఆంటి అంకుల్ అంటూ
అమెరికాను మింగేస్తుంది
అంటురోగపు మహమ్మారి కరోన

విదేశంలో కూర్చున్న విద్రోహి
ఈ దేశానికి రావద్దంటున్నా
మాయదారి మహమ్మారి కరోన

ఇల్లు ఇర్కటం ఆలి మర్కటం అంటుంటే
దేశం మీద విరుచుకు పడుతుంది
వగలాడి మహమ్మారి కరోన



–కోలంట్ల రామకృష్ణ
9966804126

## పరిశుభ్రతే మనకు శ్రీరామ రక్ష

పరిశుభ్రతే మనకు శ్రీరామ రక్ష
అపరిశుభ్రతే వేస్తుంది మనకు శిక్ష
అందుకే మానవా పరిశుభ్రత పాటించు
తప్పించుకో కరోనా మహమ్మారి శిక్ష.

ఇల్లు విడిచి రావొద్దూ సుమా
కరోనాను అలా కౌగిలించొద్దూ సుమా
ఇరవై ఒక్కరోజులు ఇంట్లోనే ఉండు
లేకుంటే వచ్చును నీ ఒంట్లోకే సుమా.

కారం మెతుకులు తిన్నా పర్లేదు
కరోనాను మాత్రం పలకరించకు సుమా
ఉగాది ఇంట్లోనే జరపాలి నేస్తమా
ఉన్నంతలో సంతోషంగా ఉండాలి సుమా.

రోడ్లమీదికి రావొద్దూ ఎవ్వరు కూడా
రోగం మరింత పెంచొద్దూ ఎవ్వరు
కరములు చక్కగ కడగాలి అందరూ
కరోనాను దూరం తరమాలి అందరూ.

ముక్కుకు ముసుగును వేయాలి సుమా
మహమ్మారి అంతం చూడాలి నేస్తమా
కరచాలనం మానాలి ఇకనుండి సుమా
కరోనాను దూరం పెట్టాలి నేస్తమా.

నమస్కారం అందరికి నేర్పాలి నేస్తమా
నవ్వుతు అందరు బతకాలి నేస్తమా
ఇరవై రోజులు ఇంట్లుంటే సుమా
ఇలలో స్వర్గం నీవెంటే సుమా.

కాదని బయట తిరిగేస్తే సుమా
కరోనా రోగం నీవెంటే నేస్తమా
కలో గంజో కన్నవారితో పంచుకో
ఆప్యాయత పెంచుకోఅయినవారితో సుమా.


సామాజిక దూరం అందరితో పాటించు
చేతనైనంత కరోనాను తరిమెందుకు సహకరించు
అయినవారికి, కన్నవారికి ఆరోగ్యాన్ని అందించు
అందరిలో ఆరోగ్యాన్ని ఆనందాన్ని పెంపొందించు.

కార్మికా పారిశుద్ధ్య కార్మికా వందనం
కరోనానెదుర్కొంటూ పనిచేస్తున్న కార్మికా వందనం
కచరాను తొలగిస్తున్న కార్మికా వందనం
పారిశుద్ధ్య కార్మికా వందనం అభివందనం.

మాప్రాణాలు కాపాడే వైద్యులారా వందనం
వైరస్తో తల్పడుతున్న వైద్యులారా వందనం
వ్యాధిగ్రస్తుల సేవచేస్తున్న నర్సులరా వందనం
వైద్యులారా, నర్సులరా వందనం అభివందనం.

మారక్షణకై శ్రమిస్తున్న రక్షకభటా వందనం
మీప్రాణం అడ్డుపెడుతున్న రక్షకభటా వందనం
మాకోసం శ్రమిస్తున్న జర్నలిస్టులారా వందనం
రక్షకభటులారా జర్నలిస్టులారా
వందనం అభివందనం.


నరుడు కానరాడు కదా నగరమందు
యముడు తిరుగుచుండె చూడు వీధులందు
సహనమొక్కటి కావాలి కరోనా సమరమందు
సమయం సద్వినియోగం చేసుకోవాలి
గృహమునందు.



–రాంనరేష్ కుమార్
9492682285

## గాబరాపడితెట్ల.....?

ప్రతి ప్రశ్నకు కాలమే సమాధానం సెప్తది
కాలానికే ఎదురెళ్లితే ఎట్లా...!
అపదచ్చిందంటే చాలు
ఆదుకునే వారుండేవారు వచ్చినాపద అందరిది కదా
ఎవరో వచ్చి ఆదుకోవడం కాదు
అందరూ కలిగి ఇంట్లో వుండడమే మంచిది
అప్పట్లో గత్తరొచ్చిందని అనేటోళ్ళు
ఊర్లకు ఊర్లు మట్టిలో కలిసి పోయినా
గడప దాటకుండా గుడిసెలో గుండె దాసుకున్నరుగా
నిన్న మొన్న ముచ్చట వేరు అర్థం కాలేదనుకుందాం
ఇప్పుడైతే అందరికి అర్థమైంది గదా
గడియ గడియకు భయపడడం ఎందుకు
గడప దాటకుండా గవర్నమెంట్ మాటింటే చాలు
కష్ట మొచ్చినప్పుడే కదలకుండా వుండాలి
కారోనాను ముట్టుకుంటా అంటారేంటి
బతకడానికి తెచ్చుకున్న పోరాట గడ్డ మనది
నిన్న ఎట్లా పోగొట్టు కుంటుందనుకుంటున్నావు
ఎన్నో అద్భుతాలు చూడాల్సిన జీవితం ముందుంది
ఇట్లా తాపతాపకు బయటకొచ్చి గాబరాపడితెట్ల...?
గట్క తిని,
గంజి మెతుకులు తాగిన తరతరాల వారసులం
పంచతంత్ర కథలు, కాశీ మజిలీ కథలు చెప్పుకుంటూ
ఇంటిల్లి పాది గంపకింది
కోళ్లోలే వంటింట్లో ఒదిగిపోయి
పద్యాలు, పాటలతో అలసట లేని జీవితంలో
దొరికిన సమయాన్ని సమాజ చైతన్యం గూర్చి
ఇంట్లో పిల్లలతో ఇగురంగా ముచ్చటిస్తే పోలే
ప్రపంచమంతా
కరోనా కోరల్లో చిక్కుకుని అలమటిస్తుంటే
ప్రశ్నల వర్షం కురిపించడం మానుకుని
ప్రభుత్వ మార్గదర్శనంలో పయనిద్దాం
కరోనా వైరస్
కంటికి కనిపించకుండా చేద్దాం



–ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

## కరోనా మెరుపులు

చైనాలో పురుడుపోసుకుంది
ఇటలీని చేరింది
ప్రపంచాన్ని పాకింది
కరోనా మహమ్మారది.

మందులు లేవు
కరోనా వైరస్ కు
జాగ్రత్తలు పాటించునీవు
కరోనా నివారణకు.

రోడ్లపై తిరుగకు
ఇంటిలోనే ఉండుము
సమూహంలో ఉండకు
మాస్కులు ధరించుము.

వ్యక్తిగత పరిశుభ్రతను
పాటిద్దాం
విశ్వంనుండి కరోనాను.
తరిమేద్దాం

మావిచిగురు రాకముందే
మాహమ్మారి వచ్చింది
వసంతకూజిత కూయకముందే.
కరోనా చుట్టేసింది

ఇంటిలోనే ఉందాము
లాక్డౌన్ పాటిద్దాము
కరోనాను తరిమేద్దాము
మనలని కాపాడుకుందాము

వికారి వినాశనము
కరోనా కర్కశము
చూపినా పలుకుదాము
శార్వరికి ఆహ్వానము.

–శీలోజు శోభన్ బాబు
9676858160

## లక్ష్మణ రేఖ

ఆయుధాలు లేవు
అణుయుద్ధం కాదు
రణనాదం చేయదు
రక్తపాత మసలు లేదు.
ఉప్పెనలా ముంచేసే
ప్రళయకాల ఘోష ఇది
తెలియకనే కమ్ముకునే
మృత్యులోక మేఘమిది.
తెలివి కలిగి మెదలడమే
మనుషులుగా మన విధి
అప్రమత్తతే ఇప్పుడు
అసలైన ఔషధి.
తెలిసి తెలిసి ఇల్లు దాటి
దిగవద్దు ఊబిలోకి
మానవాళి మనుగడకు
తేవద్దు ప్రమాదాన్ని.
ఇంటి గడపయే ఇప్పుడు
మనిషికి రక్షణ రేఖ
కరోనాసురుడి అంతానికి
గీసిన లక్ష్మణ రేఖ.

– వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

